www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

సోమవారం 10, ఆగస్టు, 2026 8 పేజీలు

## ఆదివాసీ గిరిజనుల దశాబ్దాల కలలను సాకారం చేసింది కేసీఆర్

**మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్**

**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు 9 (భద్రాద్రి న్యూస్):–** ఆదివాసీ గిరిజనుల దశాబ్దాల కలలను, ఆకాంక్షలను సాకారం చేసిన ఘనత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కే దక్కుతుందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలుపుతూ మాట్లాడారు. ఆదివాసీ గిరిజనుల దశాబ్దాల డిమాండ్లను నెరవేర్చేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక కీలక నిర్ణయాలు తీసుకుందని అన్నారు. స్వయంపాలన, రిజర్వేషన్ల పెంపు, పోడు భూములకు పట్టాల పంపిణీ వంటి కార్యక్రమాలను అమలు చేసి గిరిజనుల హక్కులను పరిరక్షించామని తెలిపారు.



2లో

# మద్యం మత్తును తరిమికొడదాం



- సరదాగా మొదలై బానిసగా మారుతున్న మహమ్మారి
- వ్యాసన పరాల్లో అత్యధికులు యువతే
- మద్యం మహమ్మారికి బానిసవుతున్న యువత

**చందుగొండ ,ఆగస్టు 9 (భద్రాద్రి న్యూస్ ):** స్నేహితుడికి కుమారుడు జన్మిస్తే దావత్... పెళ్లి చేసుకుంటే దావత్... సెలవులు వస్తే దావత్... చివరికి ఇంట్లో ఎవరైనా చనిపోతే ఓదార్చేందుకు కూడా దావత్.. ఇలా ఏ సందర్భం ఏదైనా మద్యం లో మునగాలసిందే, మనిషి జీవితంలో మత్తు భాగ్యస్వామిగా మారిపోయింది. ఈ క్రమంలో మత్తుకు బానిసలైన వారికి చికిత్స అందించి పూర్వ స్థితికి తీసుకొచ్చేందుకు నగరంలో పలు రిహాబిలేషన్, డి అబ్రికేషన్ సెంటర్లో పనిచేస్తున్నాయి.ఈ సెంటర్లలో ఎలాంటి చికిత్స అందిస్తారు, ఎన్ని రోజులు ఇస్తారు, మద్యం తాగిన వ్యక్తిలో ఎలాంటి మార్పులు వస్తాయనే తదితర అంశాలపై ప్రత్యేక కథనం...








2 లో..

## ఇందిరమ్మ స్ఫూర్తితో

## ప్రతి మహిళ ఉక్కు మహిళగా ఎదగాలి

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దానసరి అనసూయ

పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించిన మంత్రి సీతక్క

మహిళలు కష్టాలను ధైర్యంగా ఎదుర్కొని ఆర్థికంగా స్వావలంబన సాధించాలి

మహిళా సంఘాలకు రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు

రుణాలను సద్వినియోగం చేసుకుని ఆదాయం వచ్చే వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టాలి

స్థానిక వనరులను ఆదాయ వనరులుగా మలుచుకుని మార్కెటింగ్‌పై దృష్టి సారించాలి



4లో

## కొమరం భీమ్ ఆశయాల స్ఫూర్తితో ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవాన్ని కాపాడుకుందాం



5లో

# మద్యం మత్తును తరిమికొడదాం...

మొదటి పేజీ తరువాయి

**– మద్యానికి బానిసలైన వారి లక్షణాలు**

భావోద్వేగాలు ఇవన్నీ నిరంతరం ఆ వ్యక్తికి తాగుడుకు ప్రేరేపిస్తుంటాయి. కుటుంబ ఆర్థిక స్థితి, వృత్తి, సామాజిక విలువ, వ్యక్తిత్వం, ఆధ్యాత్మిక చింతన పూర్తిగా నాశనం అవుతాయని తెలిసినా అతని శరీరం మనసు తాగుడు నే కోరుకుంటుంది. మద్యం లేకుండా ఉండలేడు.

**– కారణాలు...**

వారసత్వ ధోరణి, వ్యక్తిగత సమస్యలు, ఆల్కహాల్ లోని ఇందానల్ పొగాకులో ఉండే నికోటిన్ ప్రభావం పరిసరాల ప్రభావంతో మద్యానికి బానిసలు అవుతారు.

**– మద్యం మహమ్మారికి బానిసవుతున్న యువత**

నేటి యువతకు మద్యం తాగడం సరదా అనిపిస్తుంది. అలా సరదాగా మొదలైన అలవాటు కొద్ది రోజుల్లోనే మద్యం మహమ్మారికి బానిసలు అవుతున్నారు. ఇటీవల మద్యానికి డ్రగ్స్ తోడైంది. ఓవైపు మద్యం మరోవైపు డ్రగ్స్ అనేక కుటుంబాలను వీధిన పడేస్తున్నాయి. మత్తులో నేరాలకు పాల్పడుతూ భవిష్యత్తును అంధకారం చేసుకున్నవారు ఎందరో ఉంటే, మత్తుకు బలైపోతున్న వారు అనేకమంది ఉంటున్నారు. సమాజంలో చైతన్యం వస్తున్న రోజు రోజుకు మద్యం, డ్రగ్స్ కు బానిసలుగా మారుతున్న వారి సంఖ్య పెరుగుతుందే తప్పితే తగ్గటం లేదని పలు సర్వేలు చెబుతున్నాయి.

**– చికిత్స విధానం**

మద్యం, డ్రగ్స్ కు మానసిక శారీరిక ప్రవర్తనను బట్టి రెండు రకాల చికిత్స అందిస్తారు.అందులో మొదటిది డీ ఆడికషన్ సెంటర్లో అడ్మిట్ చేసుకుని చికిత్స అందించడం, రెండోది ప్రతి పది రోజులకు ఒకసారి చికిత్స అందిస్తూ పర్యవేక్షించడం రిహాబిలేషన్, డి అడిక్షన్ సెంటర్లో అడ్మిట్ చేసుకున్న వ్యక్తి కి సుమారు మూడు నెలలు పాటు చికిత్స అందిస్తారు. క్లినిక్, సైకియాట్రిస్ట్, సైకాలజిస్ట్, కౌన్సిలర్లతో రోగికి కౌన్సిలింగ్ నిర్వహించి మానసిక పరివర్తన కలిగించేందుకు కృషి చేస్తారు. కుటుంబీకులను సైతం పిలిపించి వారికి కూడా కౌన్సిలింగ్ ఇస్తారు. మానసిక వైద్యంతో పాటు ,శారీరకంగా వచ్చిన వ్యాధులకు చికిత్స అందిస్తారు. రోజు ఉదయం సాయంత్రం డాక్టర్ పరీక్షించి సరైన మందులు ఇస్తారు.

# ఆదివాసీ గిరిజనుల దశాబ్దాల కలలను సాకారం చేసింది కేసీఆర్

మొదటి పేజీ తరువాయి

“విధ్వంసపు దారుల నుంచి వికసిత తోవలకు.. మోడువారిన బతుకుల్లో మోదుగుపూల పరిమళాలు” అనే విధంగా ఆదివాసీ గిరిజనుల అభ్యున్నతికి కేసీఆర్ ప్రభుత్వం కృషి చేసిందని పేర్కొన్నారు. “మా నాటే మా రాజ్.. మా తండాలో మా రాజ్యం” అనే ప్రజాస్వామిక ఆకాంక్షను సాకారం చేస్తూ అనేక గూడేలు, తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని తెలిపారు. అటవీ భూములపై గిరిజనులకు హక్కులు కల్పిస్తూ హక్కు పత్రాలను అందజేశామని పేర్కొన్నారు. ఆదివాసీ గిరిజనులు ఆత్మగౌరవంతో జీవించేలా గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసిందన్నారు. విద్య, ఉద్యోగ రంగాల్లో గిరిజనుల భాగస్వామ్యాన్ని మరింత పెంచేందుకు 10 శాతం రిజర్వేషన్లను అమలు చేసి తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపామని చెప్పారు.

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గిరిజనుల కోసం సబ్-ప్లాన్‌ను పటిష్టంగా అమలు చేశామని, గిరిజన సహకార సంస్థ ద్వారా ఉపాధి అవకాశాలను కల్పించామని తెలిపారు. అటవీ ఉత్పత్తులకు ‘గిరి’బ్రాండ్‌ను ప్రోత్సహిస్తూ వాటి విక్రయాలకు మార్కెటింగ్ అవకాశాలు కల్పించి గిరిజనుల ఆర్థికాభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం తోడ్పాటు అందించిందని పేర్కొన్నారు. ఆదివాసీ గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం, స్వయంపాలన, ఆర్థికాభివృద్ధి కోసం కేసీఆర్ ప్రభుత్వం చేసిన కృషి చిరస్మరణీయమని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు.

# ఎంఆర్‌పీ దోపిడీ కనిపించదా..?

**అబ్కారీ శాఖ టార్గెట్లపైనే దృష్టా..? అక్రమ వసూళ్లపై చర్యలు ఎక్కడ?**

**ఆటోల ద్వారా మద్యం సరఫరా చేస్తున్నా పట్టించుకోరా..? ధర్నాకు సిద్ధమవుతున్న గ్రామస్తులు**






**కారేపల్లి. ఆగస్టు 9(భద్రాద్రి న్యూస్ ):** మద్యం విక్రయాల్లో ఎంఆర్‌పీకి మించి వసూళ్లు జరుగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నా అబ్కారీ శాఖ అధికారులు ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నలు కారేపల్లి మండల ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ అనుమతితో లైసెన్స్ పొందిన మద్యం దుకాణాల్లో నిర్ణయించిన ఎంఆర్‌పీ కంటే ఒక్కో బాటిల్‌పై అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మద్యం దుకాణాలపై పర్యవేక్షణ బాధ్యత అబ్కారీ శాఖదే అయినప్పటికీ.. ఎంఆర్‌పీ కంటే అధికంగా వసూలు చేస్తున్న విషయం అధికారులకు తెలియదా..? లేక తెలిసినా చూసీచూడనట్టుగా వదిలేస్తున్నారా..? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కారేపల్లి మండలంలో సిండికేట్‌గా ఏర్పడి ఒక్కో బాటిల్‌పై రూ.15 నుంచి రూ.20 వరకు అదనంగా వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు బెల్ట్ షాపుల వద్ద ఒక్కో బాటిల్‌పై రూ.20 నుంచి రూ.30 వరకు అధికంగా వసూలు చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి వసూళ్లు అధికారుల దృష్టికి రాకపోవడం వెనుక కారణమేంటి..? అని ప్రజలు నిలదీస్తున్నారు.

**ఆటోల ద్వారా మద్యం సరఫరా..**

**ఒక్క ఆటోనైనా పట్టుకున్నారా?**

మండలంలోని పలు గ్రామాలకు ఆటోల ద్వారా మద్యం తరలించి విక్రయిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. గ్రామాల్లోకి మద్యం చేరవేస్తున్న ఆటోలపై ఇప్పటివరకు అబ్కారీ శాఖ ఎలాంటి చర్యలు తీసుకుందో అధికారులు వెల్లడించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటివరకు ఎన్ని ఆటోలను తనిఖీ చేశారు..? ఒక్క ఆటోనైనా సీజ్ చేశారా..? కేసులు నమోదు చేశారా..? అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం మద్యం విక్రయాలకు లైసెన్సులు ఇచ్చింది నిబంధనల ప్రకారం వ్యాపారం నిర్వహించేందుకే తప్ప.. వినియోగదారుల నుంచి ఇష్టారాజ్యంగా అదనపు వసూళ్లు చేసేందుకు కాదని ప్రజలు అంటున్నారు. అబ్కారీ శాఖ పర్యవేక్షణ కేవలం ప్రభుత్వ ఆదాయ టార్గెట్లకే పరిమితమా..? లేక మద్యం కొనుగోలు చేసే వినియోగదారుల హక్కులను కాపాడటం కూడా శాఖ బాధ్యతేనా..? అని ప్రశ్నిస్తున్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు, అక్రమ మద్యం విక్రయాలు, అనధికారికంగా మద్యం తరలింపుపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా చిన్న వయసు పిల్లలు మద్యం విక్రయ కేంద్రాల ప్రభావానికి గురికాకుండా కట్టడి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**ధర్నా చేస్తేనే అధికారుల్లో కదలిక వస్తుందా?**

ఇప్పటివరకు పలుమార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సరైన చర్యలు కనిపించడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు ధర్నాకు దిగే వరకు అబ్కారీ శాఖ అధికారులు వేచి చూస్తున్నారా..? అని ప్రశ్నిస్తున్నారు.

ఎంఆర్‌పీ కంటే అధికంగా వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు, బెల్ట్ షాపుల నిర్వహణ, ఆటోల ద్వారా మద్యం సరఫరా వంటి అంశాలపై అబ్కారీ శాఖ అధికారులు బహిరంగంగా స్పందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటివరకు నిర్వహించిన తనిఖీలు, నమోదు చేసిన కేసులు, సీజ్ చేసిన వాహనాలు, తీసుకున్న చర్యల వివరాలను అధికారులు వెల్లడించాలని కోరుతున్నారు.

ప్రజల ప్రశ్నలకు అబ్కారీ శాఖ సమాధానం ఇస్తుందా..? లేక గ్రామస్తులు ధర్నాకు దిగే వరకు మౌనంగానే ఉంటుందా..? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

# వంగా సాంబశివరెడ్డి మృతి - మాజీ ఎంపీ నామ సంతాపం

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 9( భద్రాద్రి న్యూస్):-**



ఖమ్మం నగర వాస్తవ్యులు, నిర్మల్ హృదయ్ స్కూల్ అధినేత వంగా సాంబశివారెడ్డి ఆదివారం ఉదయం మరణించిన విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సాంబశివారెడ్డి కుమారుడు వంగా సుధాకర్ రెడ్డితో నామ ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. ఈ దుఃఖ సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని నామ సూచించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు మాజీ ఎంపీ నామ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం



**గుండాల ఆగస్టు 9 భద్రాద్రి న్యూస్**

గుండాల మండలం కాంచనపల్లి గ్రామంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవ సందర్భంగా ఆదివాసి పాటలతో బ్యాండ్‌లి చప్పులతో పిల్లల డాన్సులతో విధి విధిన ర్యాలీ ప్రదర్శించడం జరిగింది లిఆదివాసి నినాదాలతో గ్రామం మారుమోగిందిలికాంచనపల్లి సెంటర్లో పూనెం సుధీర్ అధ్యక్షతన గ్రామ దొర కొమరం రవి పటేల్ పూనెం వెంకటేశ్వర్లు జెండా ఆవిష్కరణ చేశారు. ఆదివాసి ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం జిల్లా నాయకులు పూనెం రంగన్న మాట్లాడుతూ. ఆదివాసీల హక్కులను పాలకులు కాలరాస్తున్నరాని, కుట్రపూరితంగా చట్టాలను నిర్వీర్యం చేస్తున్నరాని, మన భూమి కోరకు 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, మన భూమి భుక్తి కోసం అనేక మంది ఆదివాసీలు అమరులయ్యారని వారు అన్నారు ప్రమాదం అంచున ఉన్న మన ఉనికిని భవిష్యత్తు తరాలకు అందించటానికి మన అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఆదివాసి చేయి చేయి కలిపి కాలు కాలు కదిపి ఆదివాసి ఉద్యమాలలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు, విద్య, వైద్యం, అభివృద్ధి కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలపై ప్రేమ చూపాలని అన్నారు. ఆదివాసి చట్టాలు కేవలం ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని జరుపుకోవడానికే కాకుండా ఆదివాసి చట్టాలను కూడా ప్రతి రోజు ఉపయోగ పడేలా చేయాలని వారు అన్నారు లిఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అశోక్ కుమార్ ఆదివాసి నాయకులు పోలబోయిన వెంకట్ నర్సు పరిషిక చంద్రయ్య పూణెం లక్ష్మీనారాయణ తాటి రామనాథం కుంజ రమేష్ గో గేల చంద్రయ్య బోర్రకళ్యాణి పూణ్యం లక్ష్మి పూనం వెంకన్న పరిషక పుల్లయ్య మోకల భద్రం షాట్ల కిరణ్ కుంజ చిరంజీవి కోరంభద్రం అరెం వెంకటస్వామి బట్టు రమేష్ తదితర ఆదివాసి నాయకులు పాల్గొన్నరు

భద్రాద్రి న్యూస్
సోమవారం 10, ఆగస్టు, 2026

## ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన పాత సూరారం కోయ గుంపు

**పాల్వంచ, ఆగస్టు09 (భద్రాద్రి న్యూస్):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని పాత సూరారం కోయ గుంపులో



శనివారం ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణతో పాటు గిరిజనుల ఐక్యత, హక్కుల సాధనపై నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో సంప్రదాయ పూజలు నిర్వహించి, ఆదివాసీ సంస్కృతిని ప్రతిబింబించే విధంగా వేడుకలు జరిపారు.
ఈ కార్యక్రమంలో పెద్ద పటేల్ మెస్సు రాములు, పూజారి కొరస వీరభద్రం, దొర మెస్సు రాము, తోలం బాబూరావు, పోడియం వీరస్వామి, పోడియం సత్యం, మెస్సు సహదేవుడు, తోలం కృష్ణ, కొరస బండ వెంకన్న పాల్గొన్నారు.
అదేవిధంగా మహిళలు, యువకులు పెద్ద ఎత్తున హాజరై ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు. కార్యక్రమం ఆదివాసీ ఐక్యతను చాటుతూ ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసింది.

## పాము కాటుతో వ్యవసాయ కూలీ మృతి

**కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 9 (భద్రాద్రి న్యూస్):**



పాము కాటుకు గురై వ్యవసాయ కూలీ మృతి చెందిన సంఘటన లక్ష్మీదేవిపల్లి మండలం హర్యాతండా గ్రామపంచాయతీ పరిధిలోని హరియా తండాలో ఆదివారం వెలుగుచూసింది. గ్రామానికి చెందిన భూక్యా బాలు (60), తండ్రి హరిసింగ్, వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. ఆగస్టు 8వ తేదీ రాత్రి బాలు ఇంట్లో నిద్రకు ఉపక్రమించాడు. ఆగస్టు 9వ తేదీ తెల్లవారుజామున నిద్రలోనే మృతి చెంది ఉండటాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారు. మృతుడి కుడికాలి బొటనవేలిపై కాటు ముద్రలు కనిపించడంతో పాము కాటుతో మృతి చెంది ఉండవచ్చని అనుమానించారు.
వెంటనే ఈ విషయాన్ని లక్ష్మీదేవిపల్లి పోలీసులకు సమాచారం అందించి ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా వివరాలను నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం మృతికి గల కారణం స్పష్టమయ్యే అవకాశం ఉంది. బాలు మృతితో హరియా తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

## ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం



**కూసుమంచి, ఆగష్టు 09(భద్రాద్రి న్యూస్):**
ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం అని ఖమ్మం రూరల్ ఏసిపి తిరుపతి రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మం జిల్లా, కూసుమంచి మండలం లోని నరసింహుగూడెం గ్రామం నందు ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు గ్రామపంచాయతీ ఆఫీస్ నందు ప్రారంభించారు. ఈ సీసీ కెమెరాలు ఏర్పాటు కు తోడ్పాటు చేసిన గ్రామ సర్పంచ్కి మరియు గ్రామ పెద్దలు, ఉద్యోగస్తులు, మరియు గ్రామ పాలక మండలికి ప్రత్యేకంగా ఏసిపి శాలువాలతో సత్కరించిన్నారు. ఏసిపి మాట్లాడుతూ ..ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని, నేరాలు అరికట్టడానికి సీసీ కెమెరాలు ఎంతో తోడ్పడతాయని తెలిపారు. కూసుమంచి మండలంలో ఉన్న ప్రతి గ్రామ సర్పంచ్ లు నరసింహులగూడెం గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఏసిపి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీపితో పాటు కూసుమంచి సిఐ సంజీవ్, ఎస్ఐ నాగరాజు, మరియు నరసింహల గూడెం సర్పంచు మరియు ఉద్యోగస్తులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గడ్డిగుట్టలో ఘనంగా గిరిజన ఆదివాసీ దినోత్సవం

**కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 9 ( భద్రాద్రి న్యూస్):**
లక్ష్మీదేవిపల్లి మండలం గడ్డిగుట్ట గ్రామపంచాయతీలో ప్రపంచ గిరిజన ఆదివాసి దినోత్సవాన్ని సేవాలాల్ బంజారా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు... ఈ సమావేశంలో సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లావుడియా ప్రసాద్ నాయక్ మాట్లాడుతూ ఆదివారం ప్రపంచ గిరిజన ఆదివాసి దినోత్సవం గడ్డి గుట్ట గ్రామపంచాయతీలో ర్యాలీగా నిర్వహించారు గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని మరియు అడవులు పకృతిని కాపాడుతూ ప్రత్యేక సంస్కృతి సంప్రదాయాలకు కాపాడాలని హక్కుల పరిరక్షణ గిరిజన ఆదివాసి గిరిజనులపై జరుగుతున్న అన్యాయలను అరికట్టాలి భూములను అటవి హక్కులను కాపాడాలి



సంస్కృతి సంరక్షణ అంతరించిపోతున్న గిరిజన ఆదివాసి మాతృభాషను జీవన విధానం సంప్రదాయం వైద్య విద్య ఉపాధి వారి కళలను ప్రోత్సహించడం గిరిజన ఆదివాసి హక్కులని కాపాడాలని, ఏజెన్సీ ఏరియా 1/70 యాక్ట్ చట్టం, అమలు, పిసా చట్టం, అటవి హక్కుల చట్టం జీవో నెంబర్ త్రీ పునరుద్దించాలని గిరిజన ఆదివాసి ఐక్యతతో ముందుకు సాగాలని తెలియజేశారు ఈ సమావేశంలో గడ్డి గుట్ట సర్పంచ్ బోడా సంతోష్ నాయక్, సేవాలాల్ బంజారా సంఘం విద్యార్దిభాగం రాష్ట్ర కార్యదర్శి బోడా శ్రీనివాస్ నాయక్ లావుడియా నరేష్ నాయక్, బోడా నరేష్ నాయక్, బోడ గణేష్ నాయక్, లావుడియా సాయి కుమార్ నాయక్, సింహాద్రి నాయక్, ప్రవీణ్ నాయక్, చిట్టిబాబు నాయక్, అరుణ్ నాయక్, కుమార్ నాయక్, మహిళలు కూడా పాల్గొనడం జరిగింది

## చర్లలో కొమురం భీమ్ విగ్రహావిష్కరణ ఘన విజయం..

**వేలాది ఆదివాసీల సమక్షంలో గర్జించిన ఆత్మగౌరవం!**
**జల్--జంగల్--జమీన్ పోరాట స్ఫూర్తికి చర్లలో ఘన నివాళి**
**ఆదివాసీల సంస్కృతే దేశానికి దిక్సూచి..**
**కొమురం భీమ్ ఆశయాలు చిరస్మరణీయం: పొదెం వీరయ్య**
**డోలు, మేళతాళాలు, సాంప్రదాయ నృత్యాలతో చర్లలో ఆదివాసీ సంస్కృతి వైభవం**



**చర్ల, ఆగస్టు 9: భద్రాద్రి న్యూస్**
ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల కేంద్రం ఆదివాసీ ఆత్మగౌరవ నినాదాలతో మార్మోగింది. ఆదివాసీల స్వాభిమానానికి ప్రతీకగా ఏర్పాటు చేసిన కొమురం భీమ్ విగ్రహాన్ని గౌరవ భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ సభ్యుడు, కాంగ్రెస్ శాశ్వత ఆహ్వానితుడు పొదెం వీరయ్య ఘనంగా ఆవిష్కరించారు. వేలాది మంది ఆదివాసీలు, యువత, మహిళలు, ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి కొమురం భీమ్‌కు ఘన నివాళులర్పించారు.
ఈ సందర్భంగా పొదెం వీరయ్య మాట్లాడుతూ, "జల్--జంగల్--జమీన్" కోసం కొమురం భీమ్ సాగించిన పోరాటం భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఆదివాసీల ఆత్మగౌరవం, సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం దేశానికే ఆదర్శమని పేర్కొన్నారు. ఆదివాసీల హక్కులు, అస్తిత్వం, సంస్కృతిని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు.
చర్లకు చేరుకున్న పొదెం వీరయ్యకు ఆదివాసీ మహిళలు, యువకులు డోలు వాయిద్యాలు, మేళతాళాలు, సంప్రదాయ నృత్యాలతో అపూర్వ స్వాగతం పలికారు. ఆదివాసీ కళారూపాలు, సాంప్రదాయ ప్రదర్శనలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, చర్ల మండలాన్ని ఆదివాసీ సంస్కృతి వైభవంతో నింపేశాయి.
కొమురం భీమ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఆదివాసీ నాయకులు, సంఘాల ప్రతినిధులు, నిర్వాహకులను పొదెం వీరయ్య ప్రత్యేకంగా అభినందించారు. కొమురం భీమ్ ఆశయాలు ప్రతి ఆదివాసీ యువకుడికి స్ఫూర్తిగా నిలవాలని, ఆయన పోరాట స్ఫూర్తిని భావితరాలు ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, యువత, మహిళలు, పెద్ద సంఖ్యలో ఆదివాసీ ప్రజలు పాల్గొని ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని అత్యంత ఉత్సాహభరితంగా నిర్వహించారు. చర్లలో జరిగిన ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఆదివాసీ ఐక్యత, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచింది.

## 19వ డివిజన్ నందు ఆషాఢ మాసం గోరింటాకు వేడుకలు..

**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు 9( భద్రాద్రిన్యూస్ ):-**
నవ్య బ్యూటీ పార్లర్ అధినేత్రి స్రవంతి ఆధ్వర్యంలో 19 వ డివిజన్ సంబాని నగర్ నందు ఆషాఢ మాసం గోరింటాకు వేడుకలు తెలంగాణ సాంప్రదాయ పద్ధతి లో ఘనంగా జరిగినవి . ఈ కార్యక్రమం నకు 19వ డివిజన్ మాజీ కార్పొరేటర్ చామకూరి వెంకట నారాయణ , ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య తదితరులు హాజరైనారు . వారు మాట్లాడుతూ ఆషాఢ మాసం గోరింటాకు అనేది మన తెలంగాణ సంప్రదాయం అదేవిధంగా ఇది మహిళలు అందరు కలిసి జరుపుకొనే పండుగ అని తెలియజేయడం జరిగింది . ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిన నిర్వాహకురాలు స్రవంతి , మహిళలకు వారు శుభాకాంక్షలు తెలియజేశారు



భద్రాద్రి న్యూస్
సోమవారం 10, ఆగస్టు, 2026

# ఇందిరమ్మ స్ఫూర్తితో ప్రతి మహిళ ఉక్కు మహిళగా ఎదగాలి

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 9 (భద్రాద్రిన్యూస్ ):-**
ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దానసరి అనసూయ (సీతక్క), అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదివారం అశ్వారావుపేట నియోజకవర్గంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.
ముందుగా అశ్వారావుపేటలోని గిరిజన విద్యా వికాస కేంద్రంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాణిజ్య 2025-26 నిధులతో రూ.25 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులకు మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు.
అనంతరం దమ్మపేట మండలం మారెప్పగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని చీపురుగూడెం గ్రామంలో 10 లక్షల నిర్మాణం వ్యయం తో నిర్మించిన స్వయం శక్తి గ్రామ మహిళా సంఘం భవనాన్ని మంత్రి సీతక్క ప్రారంభించారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పాయం రమాదేవి తదితరుల గృహప్రవేశ కార్యక్రమాల్లో మంత్రి సీతక్క పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని మంత్రి తెలిపారు .

పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో దమ్మపేట మండలం నాచారం గ్రామపంచాయతీ పరిధిలో రూ.1 కోటి అంచనా వ్యయంతో నాచారం గ్రామంలోని సీసీ రోడ్డు నుంచి పల్లె ప్రకృతివనం, సీతారాంపురం వరకు నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు. అనంతరంనాగుపల్లి గ్రామంలో కేరళ తరహాలో నూతనంగా నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని మంత్రి సీతక్క పరిశీలించారు. భవన నిర్మాణం, చిన్నారులకు కల్పించిన వసతులు, పరిసరాలు, మౌలిక సదుపాయాలను పరిశీలించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రాలను చిన్నారులకు ఆకర్షణీయంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడంతో పాటు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. నాగుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తూరు గ్రామంలో రూ.12 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని గర్భిణీ మహిళలకు మంత్రి సీతక్క చేతుల మీదుగా శ్రీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణీ మహిళలకు పౌష్టికాహారం అందించడం, ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించడం, తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, ఇతర సేవలను మంత్రి పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి దానసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ , అశ్వారావుపేట నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు.
మహిళలు జీవితంలో ఎదురయ్యే ఎలాంటి కష్టాలనైనా ధైర్యంగా ఎదుర్కొని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని మంత్రి అన్నారు. ఇందిరాగాంధీ జీవితాన్ని మహిళలు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నప్పటికీ ధైర్యంగా నిలబడి దేశానికి తొలి మహిళా ప్రధానమంత్రిగా ఎదిగిన ఇందిరాగాంధీని 'ఐరన్ లేడీ'గా దేశం గుర్తించిందని తెలిపారు. అదే స్ఫూర్తితో ప్రతి మహిళ కూడా కష్టాలను అధిగమించి ఉక్కు మహిళగా ఎదగాలని ఆకాంక్షించారు.కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, ఇతర సవాళ్లు ఎదురైనప్పుడు మహిళలు ఆత్మవిశ్వాసాన్ని కోల్పోవద్దని మంత్రి సూచించారు. కష్టాలు వచ్చినప్పుడు నిరాశ చెందకుండా సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని పరిష్కరించుకోవాలని అన్నారు. మహిళలు ఐక్యంగా ఉండి పరస్పరం సహకరించుకోవాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి తమ కుటుంబాలను అభివృద్ధి పథంలో నడిపించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా మహిళలకు మౌలిక వసతులు, ఆర్థిక సహాయం, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 8 వేల గ్రామ సంస్థలకు (వూలకు) భవనాల కల్పనకు చర్యలు చేపడుతున్నామని మంత్రి చెప్పారు. మహిళా సంఘాల భవనాలను కేవలం సమావేశాలకు పరిమితం చేయకుండా శిక్షణ, ఉత్పత్తి, స్వయం ఉపాధి, మార్కెటింగ్, ఇతర ఆర్థిక కార్యకలాపాలకు వినియోగించుకోవాలని సూచించారు. మహిళా సంఘాలకు రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇప్పటికే మహిళా సంఘాలకు పెద్ద ఎత్తున బ్యాంకు లింకేజీలు అందించినట్లు తెలిపారు . మహిళల పేరుతో రుణాలు అందించి వారు స్వయం ఉపాధి, చిన్నతరహా పరిశ్రమలు, ఉత్పత్తి కార్యకలాపాలు చేపట్టి ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. రుణాలను వృథా చేయకుండా ఆదాయం వచ్చే వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టాలని మంత్రి సూచించారు. ప్రారంభ దశలో కొంత కష్టంగా అనిపించినప్పటికీ క్రమశిక్షణతో, ఐక్యంగా కష్టపడి పనిచేస్తే భవిష్యత్తులో మహిళలు, వారి కుటుంబాలు ఆర్థికంగా స్థిరపడతాయని



అన్నారు. ప్రతి ప్రాంతంలో అందుబాటులో ఉన్న స్థానిక వనరులను గుర్తించి వాటిని ఆదాయ వనరులుగా మార్చుకోవాలని మంత్రి సూచించారు. కారం పొడి, పసుపు, మామిడి ఆధారిత ఉత్పత్తులు, కోళ్ల పెంపకం, పుట్టగొడుగుల పెంపకం, చిన్నతరహా యంత్రాల ఏర్పాటు వంటి కార్యక్రమాలను మహిళా సంఘాలు చేపట్టవచ్చని తెలిపారు. గ్రామాల్లో తయారు చేసే ఉత్పత్తులకు స్థానిక మార్కెట్‌తో పాటు హైదరాబాద్, ఇతర పట్టణాలు, ఇతర ప్రాంతాల్లో మార్కెటింగ్ అవకాశాలను కల్పించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మహిళలు ఎవరి మీద ఆధారపడకుండా తమ స్వశక్తితో సంపాదించి కుటుంబాలను నడిపించే స్థాయికి ఎదగాలని మంత్రి అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, రుణాలు, శిక్షణ, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లోని పేద, నిరుపేద, వితంతువులు, వికలాంగులు, సికి సెల్ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి ప్రభుత్వ అందించే ఆసరా పెన్షన్లు అందేలా మహిళా సంఘాలు సహకరించాలని మంత్రి కోరారు. ముఖ్యంగా అర్హులైన వారికి పింఛన్లు అందేలా జాబితాలను సక్రమంగా రూపొందించి ఎంపీడీఓల ద్వారా సంబంధిత అధికారులకు అందించాలని సూచించారు.

## మహిళా సంఘాల ద్వారా ఉపాధి అవకాశాలు పెంచుతున్నాం : అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా అశ్వారావుపేట నియోజకవర్గానికి విచ్చేసిన మంత్రి సీతక్కకు నియోజకవర్గ ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మహిళా సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంలో మంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు.గతంలో డ్వాక్రా మహిళలు చెట్ల కింద సమావేశాలు నిర్వహించుకునే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం మహిళా సంఘాలకు సొంత భవనాలు అందుబాటులోకి రావడం ఎంతో సంతోషకరమని ఎమ్మెల్యే అన్నారు. మహిళా సంఘాలకు భవనాలు, వడ్డీ లేని రుణాలు, సోలార్ పవర్ ప్లాంట్లు, వివిధ ఉపాధి కార్యక్రమాలు అందుబాటులోకి రావడం ద్వారా మహిళలకు స్థిరమైన ఆదాయ అవకాశాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. అశ్వారావుపేటలో మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. దమ్మపేటలో తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం, పోలీస్ స్టేషన్ తదితర ప్రాంతాలకు వచ్చే ప్రజలకు ఉపయోగపడేలా మహిళా సంఘాల ద్వారా సేవలు అందించే కార్యక్రమాలను చేపడుతున్నామని చెప్పారు. అశ్వారావుపేట మండలానికి మహిళా శక్తి కార్యక్రమాల కోసం రూ.30 కోట్ల మేర నిధులు, ములకలపల్లి, అనపర్తిపల్లి, చంద్రకొండ ప్రాంతాలకు రూ.15 కోట్ల చొప్పున నిధులు కేటాయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆయా ప్రాంతాల్లో కోళ్ల పెంపకం, పుట్టగొడుగుల పెంపకం, చిన్నతరహా యంత్రాల ఏర్పాటు తదితర కార్యక్రమాలను మహిళా సంఘాల ద్వారా చేపట్టి ఆదాయాన్ని పెంచుకునేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మహిళా శక్తి కార్యక్రమాలు ముందుకు తీసుకువెళ్లడంలో మొలకలపల్లి మండలం ముందంజలో ఉందని తెలిపారు.

## మహిళా సంఘాలకు స్థిరమైన ఆదాయ వనరుల కల్పనకు చర్యలు : కలెక్టర్ అంకిత్

జిల్లాలో మహిళా సంఘాల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్మిస్తున్న 357 ఇందిరమ్మ మహిళా శక్తి భవనం పనులు దాదాపు 80 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేసి వచ్చే నెలలో కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.
మహిళా సంఘాలకు ఆదాయ వనరులు కల్పించేందుకు చేపడుతున్న సోలార్ పవర్ ప్లాంట్ పనులు తుది దశలో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. పాఠశాలలకు అవసరమైన స్టిచ్చింగ్ పనులను మహిళా సంఘాల ద్వారా చేపట్టేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఆదర్శ పాఠశాలలకు సంబంధించిన చెల్లింపులు దాదాపు 99 శాతం పూర్తయ్యాయని తెలిపారు. ఐడీఓసీ క్యాంటీన్ తరహాలో ఇతర పట్టణ ప్రాంతాల్లో కూడా మెప్మా సహకారంతో మహిళా సంఘాలకు ఆదాయ అవకాశాలు కల్పించే కార్యక్రమాలను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వివరించారు. మహిళా సంఘాలు తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడంతో పాటు స్థానిక వనరుల ఆధారంగా స్థిరమైన ఆదాయ మార్గాలను అభివృద్ధి చేసేలా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.
చీపురుగూడెం గ్రామంలో జీవనజ్యోతి గ్రామ సమాఖ్యకు సంబంధించిన భవనంతో పాటు మరో భవనానికి కూడా మంజూరు లభించిందని, ఒక భవనం పూర్తయి ప్రారంభించామని, మిగిలిన భవనం పనులను కూడా త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు.
ములకలపల్లి ప్రాంతంలో మహిళా సంఘాలు తమ వాటా నిధులను సమకూర్చుకుని అవసరమైన స్థలాన్ని కొనుగోలు చేసి భవనాలు నిర్మించేందుకు ముందుకు వస్తున్నాయని చెప్పారు. మహిళా సంఘాలకు స్థిరమైన ఆదాయ వనరులు కల్పించే లక్ష్యంతో పెట్రోల్ బంక్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.
జిల్లాలో మహిళా సంఘాల భవనాలు, ఉపాధి కార్యక్రమాలు, సోలార్ పవర్ ప్లాంట్లు, మార్కెటింగ్ అవకాశాలు తదితర కార్యక్రమాలను శాఖల సమన్వయంతో వేగవంతంగా అమలు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా మహిళా సాధికారత, గిరిజన సంక్షేమం, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు.

ఈ కార్యక్రమాల్లో డిఆర్డిఓ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని స్వర్ణలత లేనినా,సంబంధిత శాఖల అధికారులు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# కొమరం భీమ్ ఆశయాల స్ఫూర్తితో ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవాన్ని కాపాడుకుందాం : మంత్రి సీతక్క







**భాష, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి**

**ఆదివాసీ యువత విద్య, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి**

**అశ్వారావుపేటలో కొమరం భీమ్ విగ్రహావిష్కరణ**

**అశ్వారావుపేట, ఆగస్టు 9 (భద్రాద్రిన్యూస్ ):-**

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో కొమరం భీమ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దానసరి అనసూయ (సీతక్క) హాజరయ్యారు. జిల్లాకు విచ్చేసిన మంత్రి సీతక్కకు ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు, కొమ్ము డాన్స్‌లతో ఆదివాసీ ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి సీతక్క, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్ తదితరులు ఆదివాసీ ప్రజలతో కలిసి భారీ ర్యాలీగా అశ్వారావుపేట ప్రధాన కూడలికి చేరుకున్నారు.

అశ్వారావుపేట ప్రధాన కూడలిలో ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొమరం భీమ్ విగ్రహాన్ని మంత్రి సీతక్క, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్ కలిసి ఆవిష్కరించారు. అనంతరం కొమరం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సమానత్వం కోసం కొమరం భీమ్ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. అశ్వారావుపేటలో కొమరం భీమ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఆదివాసీ జేఏసీ నాయకులు, గిరిజన సంఘాల ప్రతినిధులకు అభినందనలు తెలిపారు.

ఆదివాసీల పోరాట చరిత్ర ఎంతో గొప్పదని మంత్రి తెలిపారు . కాకతీయుల పాలనకు వ్యతిరేకంగా సమ్మక్క-సారలమ్మ చేసిన పోరాటం నుంచి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా అల్లూరి సీతారామరాజు, నిజాం పాలనకు వ్యతిరేకంగా కొమరం భీమ్ చేసిన పోరాటాల వరకు ఆదివాసీలు తమ హక్కులు, ఆత్మగౌరవం, స్వేచ్ఛ కోసం నిరంతరం పోరాడారని తెలిపారు.

ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించడంతో పాటు వారికి న్యాయంగా దక్కాల్సిన హక్కుల కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని మంత్రి అన్నారు. ఏ కులానికీ, ఏ ప్రాంత ప్రజలకూ వ్యతిరేకంగా ఆదివాసీలు లేరని, తమకు న్యాయంగా రావాల్సిన హక్కుల కోసం మాత్రమే పోరాడుతున్నారని స్పష్టం చేశారు.

అడవిపై హక్కులు, భూమిపై హక్కులు, విద్య, ఉపాధి, గృహాలు తదితర ప్రాథమిక అవసరాలు ఆదివాసీలకు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

ఆదివాసీ ప్రాంతాల నుంచి తమ సమస్యలను చెప్పుకునేందుకు వచ్చే ప్రజలను అధికారులు గౌరవంగా చూడాలని మంత్రి సూచించారు. పేదలు, చదువు లేని వారు తమ సమస్యలతో వచ్చినప్పుడు వారిని నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరి వినతిని ఓపికగా విని, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు .

ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి సీతక్క తెలిపారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో ఇప్పటివరకు వివిధ శాఖల ద్వారా సుమారు రూ.1,200 కోట్ల విలువైన అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు చెప్పారు.

స్కిల్ డెవలప్‌మెంట్, గిరిజన సంక్షేమం, పంచాయతీరాజ్, రోడ్లు-భవనాల శాఖల ద్వారా నియోజకవర్గానికి అవసరమైన మరిన్ని అభివృద్ధి పనులను మంజూరు చేయించేందుకు తన వంతు సహకారం అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

కొమరం భీమ్ "జల్, జంగల్, జమీన్" నినాదంతో పోరాటం చేశారని మంత్రి గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో నీళ్లు, నిధులు, నియామకాలు ప్రధాన అంశాలుగా నిలిచాయని తెలిపారు. కొమరం భీమ్ పోరాట స్ఫూర్తితో సాధించుకున్న తెలంగాణలో ఆదివాసీ బిడ్డలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఆదివాసీ యువత విద్యారంగంలో మరింత ఋందుకు వెళ్లాలని మంత్రి సీతక్క సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. యువత అభివృద్ధి చెందితేనే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు.

ఆదివాసీల భాష, సంస్కృతి, సంప్రదాయాలు, పండుగలు, గోత్రాలు, జీవన విధానమే వారి అస్థిత్వమని మంత్రి సీతక్క అన్నారు.

ఎంత ఉన్నత స్థానానికి ఎదిగినా తమ మూలాలను, మాతృభాషను, సంస్కృతిని, సంప్రదాయాలను మరచిపోకూడదని సూచించారు.

మన భాష, మన వేషం, మన సంస్కృతి, మన సంప్రదాయాలే మన గుర్తింపు. వాటిని కాపాడుకుంటూ భావితరాలకు అందించాలి అని మంత్రి పిలుపునిచ్చారు.

కొమరం భీమ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఆదివాసీ సమాజ అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని మంత్రి సీతక్క తెలిపారు.

**ఆదివాసీ సమాజ విద్యాభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే జారే ఆదినారాయణ**

ఆదివాసీ సమాజంలో ఐక్యత, చైతన్యం, విద్యాభివృద్ధి పెంపొందించాలనే లక్ష్యంతో అనేక సంవత్సరాలుగా కృషి చేస్తున్నామని తెలిపారు. కొమరం భీమ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఆదివాసీ సమాజానికి స్ఫూర్తినిచ్చే కార్యక్రమమన్నారు.

ఆదివాసీ యువత విద్యారంగంలో మరింత ముందుకు వెళ్లాలని, ఉన్నత విద్యను అభ్యసించి అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

అశ్వారావుపేట నియోజకవర్గంలో కొమరం భీమ్ పేరుతో ఏర్పాటు చేయనున్న అర్బన్ పార్కును మరింత అభివృద్ధి చేయడంతో పాటు అక్కడ గిరిజన మ్యూజియం ఏర్పాటు చేయాలనే ఆకాంక్ష ఉందన్నారు. ఆదివాసీల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం భావితరాలకు తెలిసేలా మ్యూజియం,గిరిజన విద్యా వికాశం భవనం ఏర్పాటు చేయడానికి అవసరమైన సహకారం అందించాలని మంత్రి సీతక్కను కోరారు.

**ఆదివాసీ సంక్షేమం, సంస్కృతి పరిరక్షణకు ప్రాధాన్యత : కలెక్టర్ అంకిత్**

జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ.. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ఆదివాసీ సోదర, సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. కొమరం భీమ్ వంటి మహనీయుల పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు.

కొమరం భీమ్, రాంజీ గోండు, సమ్మక్క-సారలమ్మ వంటి ఆదివాసీ వీరుల పోరాట చరిత్రను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీల భాష, సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వాన్ని పరిరక్షించడంతో పాటు విద్య, వైద్యం, మౌలిక వసతులు, ఉపాధి తదితర రంగాల్లో అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపారు.

ఆదివాసీ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో చైతన్యం, ఐక్యతను పెంపొందించడంతో పాటు తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పిస్తాయని కలెక్టర్ అన్నారు .

ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ విద్యా చందన, జెడ్పి సీఈవో నాగలక్ష్మి, మాజీ శాసనసభ్యులు మెచ్చ నాగేశ్వరరావు,ఆదివాసీ జేఏసీ నాయకులు, వివిధ గిరిజన సంఘాల ప్రతినిధులు, కొండరెడ్డి, నాయకపోడు తదితర గిరిజన వర్గాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆదివాసీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆదివాసీ చట్టాలపై కుట్రలు ఆపాలి.. బూర్జువా పార్టీల బహిష్కరణకు జేఏసీ పిలుపు!



**ఏజెన్సీలో 1/70 పూర్తిగా అమలు చేయాలి.. ప్రపంచ ఆదివాసీ దినోత్సవ సభలో గర్జించిన ఆదివాసీలు!**

**ఆదివాసీ హక్కులపై రాజీ లేదు.. 1/70 అమలే లక్ష్యంగా నిరంతర పోరాటం!**

**ఏజెన్సీ ప్రాంతంలో చట్టాల నిర్వీర్యంపై మండిపడ్డ ఆదివాసీలు.. స్వయంపాలనకు డిమాండ్!**

**1/70 చట్టాన్ని తాకితే ఉద్యమమే.. ప్రభుత్వాలకు ఆదివాసీ సంఘాల అల్టిమేటం!**

**వెంకటాపురం ఆగస్టు 9.భద్రాద్రి న్యూస్**

ఆదివాసీ సంఘాలు, ఆదివాసీ ఉద్యోగ సంఘాలు, ఆదివాసీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని వెంకటాపురంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కొమరం భీం విగ్రహానికి పూలమాలలువేసి నివాళు లర్పిం చారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివాసీ సమాజ ఐక్యతను చాటిచెప్పేలా ఆకుపచ్చ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జేఏసీ ఆధ్వర్యంలో నాయకులు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టాన్ని పూర్తిగా అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వాలు, అధికార యంత్రాంగం చట్టాలను నిర్వీర్యం చేస్తున్నాయని తెలిపారు. జీవో నంబర్ 3 చట్టాన్ని నిర్వీర్యం చేసే గిరిజనేతరులు ఎన్నో కుట్రలు చేసి దానిని కొట్టివేసే ప్రయత్నం చేశారని, దీంతో ఏజెన్సీ ప్రాంతంలో యువతకు ఉద్యోగ అవకాశాలు లేకుండా పోయాయని ఈ సందర్భంగా తెలిపారు. 5వ షెడ్యూల్ భూభాగంలో ఆదివాసీల గుండె లాంటి 1/70, పీసా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.. ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టానికి విరుద్ధంగా గిరిజనేతరులు నివసించడం చట్టవిరుద్ధమని వారు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 1/70 చట్టాన్ని రద్దు చేయాలని కొంతమంది గిరిజనేతరులు సుప్రీంకోర్టులో కేసు వేయడం రాజ్యాంగ విరుద్ధమని, తమ ప్రాంతానికి వచ్చి తమ చట్టాలను సంహరించాలని కోరుతూ కోర్టులో పిటిషన్ చేయడం ఏమిటని వారు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, జరగబోయే వర్షాకాల అసెంబ్లీ సమావేశంలో ఆదివాసీ ఎమ్మెల్యేలందరూ కలిసి 1/70 చట్టం పూర్తిస్థాయిలో అమలు జరిగేలా తీర్మానాలు చేయాలని ఆదివాసీలందరూ ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏజెన్సీ ప్రాంతంలో జీవో నంబర్ 3ను పునరుద్ధరించి, ఆదివాసులకు 100 శాతం ఉద్యోగ దాఖలు అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వం ఆదివాసులను ముక్కలు చెక్కలుగా విభజించి పాలించిందని, నేటి ప్రభుత్వం ఆదివాసీ చట్టాలను రద్దు చేయాలని రాజకీయ పార్టీలు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతం నుంచి బూర్జువా రాజకీయ పార్టీలను బహిష్కరించాలని, బూర్జువా రాజకీయ పార్టీలను బహిష్కరించినప్పుడే ఆదివాసీ చట్టాలు ఉన్నంత స్థాయిలో అమలవుతాయని వారు అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో పీసా చట్టం ప్రకారం పీసా గ్రామసభలు నిర్వహించి తీర్మానాలు చేసి రాష్ట్రపతి, గవర్నర్లకు పంపిస్తామని, పీసా చట్టం ద్వారా 1/70 చట్టాన్ని అమలు చేసుకుంటామని వారు అన్నారు. శ్రీకాకుళం నుంచి ఆదిలాబాద్ వరకు కలిపి ఆదివాసులకు ప్రత్యేకంగా స్వయంపాలన ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 1/70 చట్టం అమలు కోసం నేటి నుంచి నిరంతర పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతం నుంచి గిరిజనేతరులను వెంటనే మైదాన ప్రాంతానికి తరలించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు, ఆదివాసీ ఉద్యోగ సంఘాల నాయకులు, ఆదివాసీ మహిళా సంఘం నాయకురాళ్లు, ఆదివాసీ యువత, ఆదివాసీ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# హక్కులు హరించొద్దు.. ఆదివాసీలను ఆదుకోండి!

**రాజ్యాంగ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి.. మాస్‌లైన్ నేతల డిమాండ్**



**సింగరేణి, ఆగస్టు 9: (భద్రాద్రి న్యూస్ ):**

ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం రాజ్యాంగం కల్పించిన చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య, జిల్లా కార్యదర్శి సీవై పుల్లయ్య ఆరోపించారు. ఆదివారం సింగరేణి మండలం టేకులగూడెం గ్రామంలో మాస్‌లైన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీర్సా ముండా, కొమరం భీమ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

టేకులగూడెం సర్పంచ్, మాస్‌లైన్ మండల కార్యదర్శి గుమ్మడి సందీప్ అధ్యక్షతన జరిగిన సభలో నాయకులు మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడిచినా ఆదివాసీల అభివృద్ధిని ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో విస్మరించాయని విమర్శించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో నాణ్యమైన విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు రహదారులు, బస్సు రవాణా సౌకర్యాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. పి.డి.ఎస్.యు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబోలా అనిల్ మాట్లాడుతూ.. కార్పొరేట్, పెట్టుబడిదారీ వర్గాల ప్రయోజనాల కోసం ఆదివాసీలను అడవుల నుంచి వెళ్లగొట్టే విధానాలను ప్రభుత్వాలు అవలంబిస్తున్నాయని ఆరోపించారు. రాజ్యాంగంలోని ఐదో, ఆరో షెడ్యూళ్లు, పీసా చట్టం, 1/70 చట్టం, 2005 అటవీ హక్కుల చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. జల్--జంగల్--జమీన్ కోసం ఆదివాసీ సమాజం చేస్తున్న పోరాటాలకు విద్యార్థుల పక్షాన పి.డి.ఎస్.యు. సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ఆదివాసీలు తమ హక్కుల పరిరక్షణ కోసం బీర్సా ముండా, కొమరం భీమ్, అల్లూరి సీతారామరాజు, బాటన్న, లింగన్న వంటి వీరుల పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాస్‌లైన్ పార్టీ కార్యదర్శివర్గ సభ్యుడు ఆవుల అశోక్, డివిజన్ కార్యదర్శి టీ. ఝాన్సీ, డివిజన్ కార్యదర్శివర్గ సభ్యుడు గుగులోతు తేజానాయక్, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వి. రాకేష్, టీయూసీఐ జిల్లా నాయకుడు ధరావత్ సక్రు, ఉప సర్పంచ్ భాస్కర్, అనసూయ, సరోజిని, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల సాకారం..కాంగ్రెస్ ప్రభుత్వమే లక్ష్యం

**కోదాడ, ఆగస్టు 9(భద్రాద్రి న్యూస్):**

కోదాడ పట్టణం లో పేదల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి అన్నారు.ఇల్లు నిర్మించడం మాత్రమే కాకుండా.. అందులో ప్రజలు సౌకర్యవంతంగా జీవించేలా అవసరమైన మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు అందజేస్తున్నామని తెలిపారు. పట్టణంలోని బాలాజీనగర్‌లో నిర్మించిన 560 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం కోదాడ పట్టణంలోని పెరిక హాస్టల్ భవనంలో ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి లబ్ధిదారులకు డబల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలు అందజేశారు.

ఈ సందర్భంగా అలా మాట్లాడుతూ.గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టినప్పటికీ.. అవసరమైన మౌలిక వసతులు కల్పించకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం పేదల ఇళ్ల సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి విద్యుత్, తాగునీరు, రహదారులు, డ్రైనేజీ తదితర మౌలిక వసతులను కల్పించి ఇళ్లను లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు.పేదలకు సొంత ఇల్లు కల్పించడం కేవలం ప్రభుత్వ బాధ్యతగా కాకుండా.. వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా చేపట్టే సంక్షేమ కార్యక్రమంగా భావిస్తున్నామని అన్నారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు.

### ఏళ్ల నిరీక్షణకు తెర

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలు అందుకున్న లబ్ధిదారుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్నామని, తమ కల ఎట్టకేలకు నెరవేరిందని పలువురు లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఇల్లు నిర్మించినా మౌలిక వసతులు లేకపోవడంతో ఇన్నాళ్లూ ఇబ్బందులు ఎదుర్కొన్నామని, ప్రస్తుతం విద్యుత్, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ వంటి సౌకర్యాలు కల్పించి ఇళ్లను అందజేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

### ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

తమకు ఇళ్లు అందేలా ప్రత్యేక చొరవ తీసుకున్న ఎమ్మెల్యే పద్మావతి రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. పట్టాలు అందుకున్న సమయంలో పలువురు లబ్ధిదారులు భావోద్వేగానికి గురయ్యారు. తమ సొంతింటి కల నెరవేరిన ఆనందంతో కొందరు మహిళా లబ్ధిదారులు ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిని ఆప్యాయంగా కౌగిలించుకుని కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు,మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని వెంకటరత్నం బాబు, వైస్ చైర్మన్ దేవరపల్లి మల్లేశ్వరి,ఆర్డీవో సూర్యనారాయణ, టీపిసిసి డెలికేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి,ఎమ్మార్వో సంతోష్ కిరణ్, కౌన్సిలర్లు స్థానిక నాయకులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.





# 2003-04పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**కోదాడ, ఆగస్టు 9(భద్రాద్రి న్యూస్):**

22 సంవత్సరాల తర్వాత 2003-04 బ్యాచ్ కి సంబంధించిన పదో తరగతి విద్యార్థులు గెట్ టుగెదర్ పార్టీని ఘనంగా నిర్వహించడం జరిగింది. పూర్వ విద్యార్థులందరూ ఒకరినొకరు కలుసుకొని ఆత్మీయంగా పలకరించుకోని వారి యొక్క సాధక బాదకాలు మాట్లాడుకొని భవిష్యత్తులో కూడా మనం ఎల్లప్పుడూ ఈ యొక్క స్నేహాన్ని కొనసాగించాలని నిర్ణయించుకోవడం జరిగింది. ఈ యొక్క గెట్ టుగెదర్ పార్టీలో వారి యొక్క గురువులు కోదాడ మండల విద్యాధికారి ఎండి. సలీం షరీఫ్ , మేళ్లచెరువు మండల విద్యాధికారి ఎస్.కె ఫాతిమా మేడం , తమ్మరమండపాలెం కాంప్లెక్స్ హెడ్మాస్టర్ జి.రాజు , మీనాక్షి , జిహెచ్ఎం. శ్రీదేవి , కొంపెల్లి శ్రీను , వేణు , యానాల ఇంద్రసేనారెడ్డి , శ్రీహరి , శివయ్య మరియు కొండలు పాల్గొనడం జరిగింది. విద్యార్థులు వారి గురువుతో కలిసి పాఠశాల ప్రాంగణంలో వారి యొక్క పాత జ్ఞాపకాలను నెమరు వేసుకొని వారు విద్యనభ్యసించిన క్లాస్ రూమ్ లో కూర్చొని గత కాలపు అనుభవ జ్ఞాపకాలు ఉపాధ్యాయుల క్రమశిక్షణ బోధన విశ్వసనీయమని పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమానికి వచ్చిన ఉపాధ్యాయులకు గౌరవంగా సన్మాన కార్యక్రమం చేసి వారికి మెమొంటోలు అందజేశారు ఈ కార్యక్రమంలో అందరూ విద్యార్థులు ఉపాధ్యాయులు హాజరు కావడం తమకు చాలా ఆనందంగా ఉండి భావోద్వేగానికి గురి అయ్యామని పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

